సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 18.05.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 206
పేజీలు: 08 వెల: రూ. 5

# మహా సంక్షోభం ముంచుకొస్తోందా?

## అమెరికా–ఇరాన్ యుద్ధ ప్రభావంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై దెబ్బ

- చమురు ధరల మోతతో దేశీయంగా పెరుగుతున్న నిత్యావసరాల భారం
- హర్మూజ్ జలసంధి సంక్షోభం.. ప్రపంచ మార్కెట్లలో కలకలం
- పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యుడిపై అదనపు భారం
- గ్లోబల్ యుద్ధాల ఎఫెక్ట్‌తో భారత్‌లోనూ ఆందోళనలు
- ఇంధన సంక్షోభం దెబ్బకు రవాణా నుంచి ఆహార ధరల దాకా ప్రభావం
- విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి.. బంగారం దిగుమతులపై ఆందోళన
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం.. కుటుంబ బడ్జెట్‌లపై ముప్పు
- మహా మాంద్యం హెచ్చరికల మధ్య ఖర్చుల నియంత్రణపై దృష్టి అవసరం
- 'పొదుపే పరిష్కారం' అంటున్న ఆర్థిక నిపుణులు



**ముద్ర డెస్క్ :**
అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను తీవ్ర అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అమాంతం పెరిగాయి. దాంతో భారత్‌తో పాటు అనేక దేశాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచీకరణ యుగంలో ఒక ప్రాంతంలో యుద్ధం జరిగినా దాని ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపైనా మిగతా 02లో

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్

### నేటి నుండి ఉప్పల్‌వరంగల్ రింగ్ రోడ్ మూసివేత

- ఈ దారిలో వాహనాలకు అనుమతి లేదు
- కొనసాగుతున్న ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు
- రెండు నెలల పాటు రాకపోకలు బంద్

04



వాహనదారులకు గమనిక.. హైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై నేటి నుంచి రాకపోకలు బంద్ కానున్నాయి. ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసేందుకు గానూ రెండు నెలల పాటు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. సికింద్రాబాద్, నాగోల్, ఎల్బీ నగర్, ఫీర్జాదిగూడ వైపు నుంచి వచ్చే వాహనదారుల కోసం పోలీసులు రూట్ లైనప్స్ మార్చారు.

-ముద్ర డెస్క్ :

## భారీ అగ్నిప్రమాదం

### యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోఘటన



- యూనిట్-3 టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో చెలరేగిన మంటలు
- కాలిబూడిదైన కంట్రోల్ కేబుల్స్

04

## ప్రేమించలేదని గొంతుకోశాడు

### జడ్చర్లలో ప్రేమోన్మాది ఘాతుకం

04

- స్పాట్లోనే యువతి మృతి
- ఆగ్రహించిన స్థానికులు
- ప్రేమోన్మాదిని చితకబాదిన ప్రజలు
- చికిత్స పొందుతూ నిందితుడు మృతి

మరో వంద అడుగులు వేసి ఉంటే కన్న వారి కళ్లముందే ఉండేది.. వచ్చే నెల లో నిశ్చితార్థం.. మరికొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఆ ఇంట.. ప్రేమోన్మాదం పెను విషాదాన్ని నింపింది. జడ్చర్లలో శనివారం సాయంత్రం యువతి వైష్ణవిపై జరిగిన కత్తి దాడి, ఆపై స్థానికుల చేతిలో నిందితుడు తేజ మరణించిన ఉదంతం రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. ప్రేమించలేదన్న కక్షతో ఒకరు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఆగ్రహంతో మరొకరు ప్రాణాలు కోల్పోవడంతో బాదేపల్లి పట్టణం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది.



## ఇక అంతా పోలీసుల చేతుల్లోనే?

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

- పోక్సో కేసు దర్యాప్తు పూర్తిగా రాష్ట్ర పోలీసుల పరిధిలోనే
- బండి భగీరథ్ లొంగిపోయాడు
- రాష్ట్ర ప్రభుత్వానికి స్వతంత్ర దర్యాప్తు హక్కు ఉంది
- రైతులకు బోనస్ లేదు.. కొనుగోళ్లు లేవు

03



## ఒకే టికెట్‌పై మూడు సార్లు శ్రీవారి దర్శనం

- భక్తులకు టీటీడీ బంపర్ ఆఫర్..
- పవిత్రోత్సవాల వేళ అవకాశం..
- 21న ఆన్లైన్లో టికెట్ విడుదల
- 5వేల టికెట్ కొన్నవారికి మాత్రమే ఛాన్స్

04



## బండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలి

- కొడుకుని కాపాడేందుకు అధికార దుర్వినియోగం
- కేసును నీరుగార్చేందుకు సీఎం, కేంద్ర మంత్రి కుమ్మక్కు

03





# అమెరికాకు భారత్-చైనా సవాల్!

## అమెరికా ఆర్థిక ఆధిపత్యానికి ఆసియా బ్రేక్..!

**ముద్ర డెస్క్ :**
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా తిరుగులేని 'పెద్దన్న'గా వెలుగొందుతున్న అమెరికా ఆధిపత్యానికి రాబోయే రోజుల్లో గట్టి బ్రేకులు పడనున్నాయా? డాలర్ బలగం, సాంకేతిక ఆవిష్కరణలు, భారీ పెట్టుబడులతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని శాసిస్తున్న యూఎస్‌ఏకు ఆసియా ఖండం నుంచి సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంలో వెనుకబడిన దేశాలుగా భావించిన భారత్, చైనాలు.. నేడు గ్లోబల్ ఎకానమీ గమనాన్ని మార్చేసే సూపర్ పవర్స్‌గా అవతరిస్తున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్, గోల్డ్‌మన్ సాక్స్, పీడబ్ల్యూసీ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సంస్థల తాజా నివేదికలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాబోయే దశాబ్దాల్లో గ్లోబల్ ఎకనామిక్ మ్యాప్‌ను ఈ రెండు ఆసియా శక్తులే తిరగరాయబోతున్నాయని విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు.

- భారత్-చైనా వృద్ధితో మారుతున్న ప్రపంచ సమీకరణాలు
- గ్లోబల్ ఎకానమీని శాసించేందుకు ఆసియా దూసుకెళ్తోంది
- డాలర్ దాదాగిరికి చెక్ పెట్టనున్న డ్రాగన్-భారత్ జోడీ
- ప్రపంచ వృద్ధిలో సగం వాటా భారత్-చైనాలదే..!
- 2050 నాటికి కొత్త ఆర్థిక సూపర్ పవర్స్‌గా ఆసియా దేశాలు
- అమెరికా వేగం మందగిస్తే భారత్-చైనా పరుగులు
- మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుదల ఖాయం?
- ప్రపంచ సంపద ఆసియా వైపు మళ్లుతోందా?
- ఏకధృవ ప్రపంచానికి ముగింపు..
- బహుళ ఆర్థిక కేంద్రాల యుగం ప్రారంభం!

### ప్రపంచ వృద్ధిలో సగం వాటా ఈ రెండు దేశాలదే!

తాజా అంచనాల ప్రకారం 2026 నుంచి 2030 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా నమోదయ్యే మొత్తం జీడీపీ వృద్ధిలో దాదాపు సగం వాటాను (50%) మిగతా 02లో

## ఎప్‌సెట్‌లో హైదరాబాద్ విద్యార్థుల హవా

### ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

- ఇంజినీరింగ్ విభాగంలో రిషికి ఫస్ట్ ర్యాంక్
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ముకరం అహ్మద్ ఫస్ట్
- త్వరలో వెబ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలకు సిద్ధం
- హాల్ టికెట్ నంబర్‌తో ర్యాంక్ కార్డుల డౌన్‌లోడ్ అవకాశం




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఈ ఫలితాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బటన్ నొక్కి ఫలితాలను, విద్యార్థుల సాధించిన ర్యాంకులను విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన రిషి ఫస్ట్ ర్యాంకు, హైదరాబాద్ మూసాపేటకు చెందిన అన్షు రెండో మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 18.05.2026
www.mudranews.in | @mudranews



### చేపలతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది



చేపలు క్రమం తప్పకుండా తినడం వల్ల జ్ఞాపకశక్తి మరియు ఏకాగ్రత పెరుగుతాయి. ఇది వయసు పైబడటం వల్ల వచ్చే మతిమరుపు (అల్జీమర్స్) వంటి సమస్యల నుండి మెదడును రక్షిస్తుంది.

# మహా సంక్షోభం ముంచుకొస్తోందా?



(మొదటి పేజీ తరువాయి)
పడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్ –రష్యా యుద్ధం తర్వాత ప్రపంచ సరఫరా వ్యవస్థలు ఇంకా కోలుకోకముందే అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ ఉద్రిక్తతలు చమురు మార్కెట్లను కుదిపేశాయి. హర్మూజ్ జల సంధి ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో కీలక భాగం జరుగుతుండటంతో అక్కడి అంతరాయం ప్రపంచ దేశాలకు భారీ దెబ్బగా మారింది. బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటడంతో చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు దిగుమతి బిల్లు మరింత పెరిగింది.

ఇప్పటికే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరుగుతోంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు భారీ అండర్ రికవరీలను ఎదుర్కొంటున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డీజిల్ ధరల పెరుగుదల రైతులపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది. ట్రాక్టర్లు, పంపు సెట్లు, రవాణా వ్యవస్థలు అన్నీ డీజిల్‌పైనే ఆధారపడటం ఇందుకు కారణం.

ధరల పెరుగుదలతో పరిశ్రమల తయారీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పెయింట్స్, సిమెంట్, కెమికల్స్, ఎయిర్‌లైన్స్, లాజిస్టిక్స్ రంగాలపై ఒత్తిడి అధికమవుతుందని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశాలు ఉండటంతో స్టాక్ మార్కెట్లలోనూ ఒడిదుడుకులు పెరిగే ప్రమాదం కనిపిస్తోంది.

ఈ పరిస్థితుల్లో ప్రజలు ఖర్చులను నియంత్రించుకోవ డం, పొదుపును పెంచుకోవడం అత్యవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అవసరం లేని ప్రయాణాలు తగ్గించడం, ప్రజా రవాణాను వినియోగించడం, ఇంధన వినియోగాన్ని తగ్గించడం, కుటుంబ బడ్జెట్‌ను ముందు గానే ప్లాన్ చేసుకోవడం అవసరమని చెబుతున్నారు. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోం వల్ల ఇంధన వినియోగం తగ్గినట్లే, ఇప్పుడు కూడా అలాంటి పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇక బంగారం దిగుమతులు కూడా దేశ విదేశీ మారక నిల్వలపై భారమవుతున్నాయి. భారత్‌లో బంగారం అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో బంగా రం దిగుమతులు రికార్డు స్థాయికి చేరిన నేపథ్యంలో, అనవసర బంగారం కొనుగోళ్లను తగ్గించాల్సిన అవ రం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మాత్రమే సమస్యలను పూర్తిగా నియంత్రించలేదని, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే 'పొదుపే రక్షణ' అనే భావనతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కుటుం బ ఆర్థిక భద్రత కోసం కనీసం ఆదాయంలో 20 నుంచి 30 శాతం వరకు పొదుపు చేయాలని ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం త్వరగా ముగిసినా, ఆర్థిక ప్రభావాలు వెంటనే తగ్గే అవకా శాలు కనిపించడం లేదు. అందుకే ఖర్చులపై నియంత్ర ణ, పొదుపుపై దృష్టి, ఇంధన వినియోగంలో జాగ్రత్తలు మాత్రమే ప్రస్తుతం సాధ్యమైన రక్షణ మార్గాలుగా కనిపిస్తున్నాయి.

# అమెరికాకు భారత్-చైనా సవాల్!

(మొదటి పేజీ తరువాయి)
భారత్, చైనాలు సంయుక్తంగా అందించబోతున్నాయి.రాబోయే ఐదేళ్లలో చైనా తన ఆర్థిక వ్యవస్థకు సుమారు 5.7 ట్రిలియన్ డాలర్ల సరికొత్త జీడీపీని జోడించనుంది. ఇదే కాలంలో భారతదేశం దాదాపు 2.1 ట్రిలియన్ డాలర్ల అదనపు వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా. ఈ స్థాయి భారీ ఆర్థిక విస్తరణను ప్రపంచంలోని మరే ఇతర దేశాలూ అందుకోలేవని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది సంఖ్యల వృద్ధి మాత్రమే కాదు.. ప్రపంచ సంపద ఆసియా వైపు మళ్లుతోందనడానికి స్పష్టమైన సంకేతం.

**అమెరికాను దాటేస్తున్న వృద్ధి రేట్లు**

ఆర్థిక వృద్ధి రేటు పరంగా చూస్తే అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్, చైనాలు ఎంతో వేగంగా దూసుకుపోతున్నాయి. 2026 నాటి అంచనాల ప్రకారం జీడీపీ వృద్ధి రేటు భారత్ 6.5%, చైనా 4.4%, అమెరికా 2.3% గా ఉన్నాయి. ముఖ్యంగా భారతదేశంలో జరుగుతున్న డిజిటల్ విప్లవం, వేగంగా విస్తరిస్తున్న స్టార్టప్ ఎకోసిస్టమ్, ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న యువ జనాభా, బలమైన దేశీయ వినియోగ మార్కెట్ మన ఆర్థిక రథాన్ని వేగంగా ముందుకు నడిపిస్తున్నాయి. మరోవైపు చైనా ప్రపంచ తయారీ కేంద్రంగా తన స్థానాన్ని నిలబెట్టుకుంటూనే అధునాతన మౌలిక వసతులు, బలీయమైన సప్లయ్ చైన్ నెట్‌వర్క్, పరిశోధన–అభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో తన ఆర్థిక ఆధిపత్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

**2050 నాటికి సరికొత్త సమీకరణాలు**

దీర్ఘకాలిక ఆర్థిక ప్రాజెక్టులు మరింత ఆసక్తికరమైన నిజాలను వెల్లడిస్తున్నాయి. 2029 నాటికి బ్రిటన్, జర్మనీ వంటి దేశాలను వెనక్కి నెట్టి భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం ఖాయమని నివేదికలు చెబుతున్నాయి. 2045 నాటికి సీఈబీఆర్ నివేదిక ప్రకారం అమెరికాను అధిగమించి చైనా ప్రపంచంలోనే నెం.1 ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2050 నాటికి గోల్డ్‌మన్ సాక్స్, పీడబ్ల్యూసీ వంటి గ్లోబల్ ఏజెన్సీల అంచనాల ప్రకారం, ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక శక్తులలో చైనా మొదటి స్థానంలో భారతదేశం రెండు లేదా మూడో స్థానంలో నిలవనున్నాయి. అమెరికా తన అగ్రస్థానాన్ని కోల్పోయి తర్వాతి స్థానాలకు పరిమితం కాక తప్పదని ఈ నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

**ఆసియా శతాబ్దం దిశగా అడుగులు?**

ఈ మార్పులు కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కావు. అంతర్జాతీయ రాజకీయాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం అంతా ఇకపై ఆసియా కేంద్రంగానే సాగనున్నాయి. ఒకవేళ భారత్–చైనా సరిహద్దు విభేదాలు పక్కన పెట్టి ఆర్థికంగా మరింత పరస్పర సహకారాన్ని పెంచుకుంటే ప్రపంచ వేదికపై ఒక తిరుగులేని సరికొత్త ఆర్థిక కూటమి ఏర్పడే అవకాశం ఉంది. అమెరికా ప్రభావం ప్రపంచం నుండి రాత్రికి రాత్రే పూర్తిగా తుడిచిపెట్టుకుపోనప్పటికీ ఏకధృవ ప్రపంచం అంతమై బహుళ ప్రత్యామ్నాయ కేంద్రాలు ఏర్పడే కాలం చాలా దగ్గరలోనే ఉందనేది జగమెరిగిన సత్యం.



# ఎప్‌సెట్‌లో హైదరాబాద్ విద్యార్థుల హవా

(మొదటి పేజీ తరువాయి)
ర్యాంకు , కడపకు చెందిన వంశీధర్ రెడ్డి మూడో ర్యాంకు సాధించినట్లు అధికారులు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ముకరం అహ్మద్ (హైదరాబాద్) ఫస్ట్ ర్యాంక్, తాడురి సాయి వెంకట్ (ఎల్బీనగర్) రెండో ర్యాంకు, సాహితి (రంగారెడ్డి) 3వ ర్యాంకు సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు మే 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 2,10,766 మంది విద్యార్థులు అప్లయ్ చేసుకోగా.. 1,97,241 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 90,977 మంది దరఖాస్తు చేసుకోగా.. 84,954 మంది పరీక్షలు రాశారు. ఈ ఏడాది ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షల్లో విద్యాశాఖ ఒక అరుదైన రికార్డును సృష్టించింది. పరీక్షలు ముగిసిన కేవలం ఆరో రోజే తుది ఫలితాలను, ర్యాంకులను ప్రకటించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానాన్ని (సీబీటీ) మరింత ఆధునికీకరిస్తూ.. ఈ ఏడాది విద్యార్థులు పరీక్ష రాసిన వెంటనే ప్రాథమిక కీ ఆధారంగా వారి మార్కులు కంప్యూటర్ స్క్రీన్‌పైనే కనిపించేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ డిజిటల్ సంస్కరణల కారణంగానే ఎలాంటి ఆలస్యం లేకుండా.. అత్యంత పారదర్శకంగా, రికార్డు కాలంలో ఫలితాలు విడుదల చేసినట్లు ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె. విజయకుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థులు ఉన్నత విద్యామండలి అధికారిక వెబ్‌సైట్ అయిన eap-cet.tgche.ac.in ద్వారా తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అధికారులు సూచించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాలలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలను కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. ఫలితాలు వెల్లడి కావడంతో తదుపరి విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ షెడ్యూల్‌ను కూడా ఉన్నత విద్యామండలి వచ్చే రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ప్రకటించనుంది.





**ముద్ర డెస్క్ :**
మోహన్ బాబు తనయుడిగా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టినప్పటికీ, తన కంటూ ఒక ప్రత్యేకమైన మార్క్ ని ఏర్పాటు చేసుకొని , మంచి ఇమేజ్ ని సొంతం చేసుకున్న హీరో మంచు మనోజ్. మొదటి సినిమా నుండి ఇప్పటి వరకు రొటీన్ కి భిన్నంగా ఈయన చేసిన సినిమాలంటే యూత్ ఆడియన్స్ కి తెగ ఇష్టం , ముఖ్యంగా ఆయన చిత్రాల్లోని పాటలకు ఉండే క్రేజే వేరు. సినిమాలు చేయడమే కాదు , ఈ హీరోకి సామజిక స్పృహ కూడా ఎక్కువే. సమాజం లో ఎదురయ్యే ప్రతీ చిన్న సమస్యపై స్పందించే గుణం , నలుగురికి సహాయం చెయ్యాలనే గొప్ప మనస్సు, ఇవన్నీ మనోజ్ కి యూత్ ఆడియన్స్ లో మంచి క్రేజ్ తెచ్చి పెట్టాయి. సోషల్ మీడియా లో మంచు ఫ్యామిలీ మొత్తం పై ట్రోల్స్ పడినప్పటికీ మంచు మనోజ్ మీద ఒక్క ట్రోల్ కూడా పడదు, అందుకు ముఖ్య కారణం ప్రవర్తించే తీరు అని చెప్పడంలో సందేహం లేదు.

ఇప్పుడు మరోసారి ఆయన ఉదార స్వభావాన్ని చాటుకొని , నెటిజెన్స్ చేత శభాష్ అని అనిపించుకుంటున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే నేడు ఆయన తన సతీమణి భూమా మౌనికతో కలిసి 'ఐక్య ధైర్య సేన సమితి' అనే సేవా సంస్థను ప్రారంభించారు. మే 20 న మనోజ్ పుట్టిన రోజు సందర్భంగా, ఆయన అభిమానులు హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో జన్మదిన వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు మనోజ్ తన భార్య మౌనిక తో కలిసి హాజరయ్యారు. అంతే కాకుండా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశాడు. మంచు మనోజ్ దంపతులు ఏర్పాటు చేసిన సేవ సంస్థను స్వయంగా నవీన్ యాదవ్ ప్రకటించాడు. ఈ ట్రస్ట్ ని ప్రారంభించిన సందర్భంగా, మొదటి రోజే 5 మంది పిల్లలను దత్తత తీసుకుంటున్నట్టు మనోజ్ అధికారిక ప్రకటన చేశాడు .

ఆ పిల్లల విద్యాభ్యాసం దగ్గర నుండి , వాళ్లకు అవసరం అయ్యే ప్రతీ ఒక్కటి సమకూరుస్తామని ఈ సందర్భంగా చెప్పుకొచ్చాడు మనోజ్. తమ సేవ కార్యక్రమాలను కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితం చేయడం లేదు, త్వరలోనే ప్రతీ పట్టణంలోనూ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చాడు. ఇది రాజకీయం కోసం చేయడం లేదు, ఈ సంస్థ మా ఇద్దరిది మాత్రమే కాదు, మానవత్వాన్ని విశ్వసించే ప్రతీ ఒక్కరిది అంటూ చెప్పుకొచ్చాడు మనోజ్. మరి రాబోయే రోజుల్లో ఈ సంస్థ ద్వారా మనోజ్, మౌనిక ఎలాంటి సేవా కార్యక్రమాలు చేయబోతున్నారో చూడాలి.

# విజయ్ విజయం ఎన్టీఆర్, ఎంజీఆర్ కంటే గొప్పది!

**ముద్ర డెస్క్ :**
తమిళనాడు రాజకీయాల్లో సూపర్ స్టార్ రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర సంచలనంగా మారాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల పరిణామాల నేపథ్యంలో, కోలీవుడ్ స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ సాధించిన రాజకీయ విజయంపై రజనీకాంత్ స్పందించిన తీరు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ సాధించిన విజయం చూసి రజనీకాంత్ అసూయ పడుతున్నారంటూ వస్తున్న పుకార్లకు ఆయన తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు.



ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన రజనీకాంత్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను రాజకీయాల నుంచి ఎప్పుడో వైదొలిగానని, అలాంటప్పుడు విజయ్‌పై అసూయ పడాల్సిన అవసరం తనకు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. "నేను ఒకవేళ రాజకీయాల్లో ఉండి ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే 100 శాతం గెలిచేవాడిని" అంటూ రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగుతున్నాయి.

స్టాలిన్ భేటీపై తప్పుడు ప్రచారాలు.. రజనీ తీవ్ర ఆగ్రహం! ఇటీవల డీఎంకే అధినేత ఎం. కె. స్టాలిన్‌ను రజనీకాంత్ కలవడం తమిళనాట తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై రజనీకాంత్ క్లారిటీ ఇస్తూ.. కొలత్తూరు నియోజకవర్గంలో స్టాలిన్ ఓడిపోవడం తనకు తీవ్ర బాధ కలిగించిందని చెప్పారు. దశాబ్దాలుగా ఉన్న తమ వ్యక్తిగత స్నేహం కారణంగానే స్టాలిన్‌ను పరామర్శించడానికి వెళ్లానని, దీనికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు.

అయితే ఈ భేటీని కొందరు సోషల్ మీడియాలో తప్పుగా వాడుకున్నారని రజనీ మండిపడ్డారు. డీఎంకే – అన్నాడీఎంకే పార్టీలను కలపడానికి రజనీ ప్రయత్నిస్తున్నాడని, విజయ్ సీఎం కాకుండా అడ్డుకోవడానికే స్టాలిన్‌తో చేతులు కలిపాడని వస్తున్న వార్తలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఇవన్నీ పూర్తిగా నాన్‌సెన్స్. నేను అంత దిగజారిన రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు. స్నేహానికి, రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదు" అని రజనీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

"ఎంజీఆర్, ఎన్టీఆర్ కంటే విజయ్ విజయం పెద్దది"ఇక విజయ్ సాధించిన రాజకీయ విజయాన్ని రజనీకాంత్ ఆకాశానికెత్తారు. తనకు, విజయ్‌కు మధ్య దాదాపు 25 నుంచి 28 ఏళ్ల వయస్సు వ్యత్యాసం ఉందన్న రజనీ.. ఇంత చిన్న వయసులోనే విజయ్ అసాధారణమైన విజయాన్ని సాధించాడని కొనియాడారు.

ఒకవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బలమైన భారతీయ జనతా పార్టీ ని, మరోవైపు తమిళనాడును దశాబ్దాలుగా ఏలుతున్న ప్రధాన ద్రవిడ పార్టీలను ఒంటరిగా ఢీకొట్టి, స్వతంత్రంగా విజయం సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక సంచలన పోలికను తీసుకొచ్చారు. గతంలో ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజాలు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించారు. కానీ అప్పటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని బలమైన శక్తులను ఎదుర్కొని విజయ్ సాధించిన ఈ విజయం.. నాటి ఎంజీఆర్, ఎన్టీఆర్ సాధించిన రాజకీయ విజయాల కంటే కూడా గొప్పదని రజనీకాంత్ అభిప్రాయపడ్డారు.

**ఎయిర్‌పోర్ట్ వీడియో వైరల్‌పై క్లారిటీ**

ఇటీవల విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులు విజయ్ విజయంపై ప్రశ్నించినప్పుడు రజనీకాంత్ సమాధానం చెప్పకుండా నవ్వుతూ వెళ్లిపోయారు. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో విజయ్ విజయం రజనీకి ఇష్టం లేదనే ప్రచారం జరిగింది. దీనిపై రజనీ స్పందిస్తూ.. "అక్కడ ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకుని, వీడియో తీస్తూ వెనకాలే పరిగెడుతూ ప్రశ్నించాడు. ఆ పద్ధతి నచ్చకే నేను కేవలం నవ్వి వెళ్లిపోయాను. అంతకుమించి ఏమీ లేదు. ఇప్పటికే నేను విజయ్‌కు ఫోన్ చేసి వ్యక్తిగతంగా నా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశాను" అని వివాదానికి తెరదించారు.


# కరీంనగర్ సింహగర్జన సభకు 25ఏళ్లు.. కేటీఆర్ ప్రత్యేక పోస్ట్

**ముద్ర డెస్క్ :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక సభ అయిన కరీంనగర్ సింహగర్జన సభకు 25 ఏళ్లు నిండాయి. ఈ మేరకు అప్పటి పేపర్ క్లిప్పింగ్‌లను ట్యాగ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 2001 మే 17న జరిగిన సింహగర్జన నుంచి ఇటీవలే పూర్తయిన రజతోత్సవ వేడుకల వరకు బీఆర్ఎస్ పార్టీ అదే జోష్‌లో ఉందని అన్నారు. కనుచూపు మేరల్లో అంతా అంధకారం, అన్నీ అపనమ్మకాలు, గత కాలపు గాయాలు.. ధనం బలం లేదు.. రాజకీయ బలగం లేదు. అయినా సింహగర్జన సభకి జనం పోటెత్తిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తనను కన్నభూమి తెలంగాణ.. ఎందుకిలా గోస పడుతుందన్న ఆవేదన, మాతృభూమిపై గుండెల నిండా పొంగే తెలంగాణ ప్రేమ, రాష్ట్రాన్ని సాధించాలన్న నిండైన పట్టుదల, ప్రజలు అండగా ఉంటారన్న భరోసా ఇచ్చిందన్నారు.

# తెలంగాణ మంత్రి 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం


**ముద్ర డెస్క్ :**
ఖమ్మం జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు కాంగ్రెస్ మంత్రులలో తుమ్మల నాగేశ్వరరావు ఒకరు. ఈయనకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. తెలుగుదేశం పార్టీలో ఈయన తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత భారత రాష్ట్ర సమితిలో చేరారు. మంత్రిగా పనిచేశారు. తనకు విలువ ఇవ్వడం లేదని.. కొంత మంది వ్యక్తులను తీసుకొచ్చి బలవంతంగా ఉమ్మడి ఖమ్మం మీద రుద్దుతున్నారని ఆరోపిస్తూ.. కొంత కాలం పార్టీకి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను.. కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను విమర్శించే తుమ్మల నాగేశ్వరరావు ఆ పార్టీలో చేరడం నిజంగా ఆశ్చర్యకరమే.

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రస్తుతం తుమ్మల నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. ఆయన సరిగా 1986లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆయన సుదీర్ఘంగా రాజకీయాలలో కొనసాగుతున్నారు. రాజకీయాలలో కొనసాగుతూ 40 సంవత్సరాల కాలాన్ని ఆయన పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఖమ్మంలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. కొన్ని పత్రికలు తుమ్మల మీద కథనాల మీద కథనాలు రాశాయి. ఆదే స్థాయిలో యాడ్స్ కూడా దండుకున్నాయి. అయితే తుమ్మల 40 సంవత్సరాల రాజకీయ ప్రస్తానానికి సంబంధించి ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఒక పైలాన్ నిర్మించేందుకు సంకల్పించారు. పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుచేసిన ప్రాంతంలోనే పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం కూడా మొదలుపెట్టారు. ఇది పీవీ నరసింహారావు అభిమానులకు ఆగ్రహాన్ని కలిగించింది. వెంటనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది కాస్త రాజకీయంగా ఇబ్బంది కలిగించే పరిణామం కావడంతో వెంటనే తుమ్మల నాగేశ్వర రావు స్పందించారు. పైలాన్ నిర్మాణం నిలిపివేయాలని కేఎంసీ కమిషనర్ ను ఆదేశించారు. దీంతో పైలాన్ ఆగిపోయింది.



### చేపలతో కంటి చూపు మెరుగవుతుంది

చేపల్లో లభించే ఒమేగా-3 యాసిడ్స్ మరియు విటమిన్-A కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి వృద్ధాప్యంలో వచ్చే కంటి చూపు సమస్యలను మరియు డ్రై ఐస్ (కళ్ళు ఆరిపోవడం) సమస్యను నివారిస్తాయి.




## ఎప్‌సెట్–2026లో
# "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం


**32 మంది టాప్-1000 ర్యాంకులు**
**450 మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత**







డి.రిత్విక్ (11వ ర్యాంక్)



పి. చరణ్ (22వ ర్యాంక్)

**ముద్ర, కరీంనగర్ :** ఎప్‌సెట్–2026 ఫలితాల్లో "అల్ఫోర్స్" విద్యాసంస్థలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశాయి. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు లు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో డి. రిత్విక్ 11వ ర్యాంకు సాధించి సంస్థకు అత్యున్నత స్థానం తీసుకురాగా, ఇంజినీరింగ్ విభాగంలో పి. చరణ్ 22వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. అలాగే సీహెచ్. లక్ష్మీహసిని 74వ ర్యాంకు, నిదా 157వ ర్యాంకు, పి. అక్షయ 251, ఎల్. అర్యన్‌రావు 252, మహ్మద్ హుస్సేన్ 272, వి. రుచిత 293, ఏ. నాగసింధు 330, బి. అభిఘ్న 430, వి. సుహాసిని 439, వి. శ్రేయస్‌రెడ్డి 487, జై నయన్ 505, జి. చైత్ర 506, బి. లిఖిత్‌సాయి 538, ఎల్. అనంతసాయి 543, కె. అక్షిత 555, జి. లాస్యారెడ్డి 614, జి. హర్షిత 637, టి. హర్షిత 697, టీ. సహస్ర 739, జె. జస్రిత్సాయి 745, డి. విశ్వతేజ 772, ఎం. సిరిమణి 814, సయ్యద్ మలాజోద్దిన్ 836, షరిన్ ఫాతిమా 898, కె. ధనుష్ 904, పి. చందన 905, ఎన్. జస్వంత్‌సాయి 921, కె. అక్షయ 951, ఎల్. ప్రణయని 954, ఎన్. రత్నప్రకాశ్ 961 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్‌కు ఘనత తీసుకొచ్చారు. ఈ ఏడాది EAPCET ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం 32 మంది విద్యార్థులు టాప్–1000 ర్యాంకులు సాధించగా, 57 మంది టాప్–2000లో, 88 మంది టాప్–3000లో, 127 మంది టాప్–4000లో, 169 మంది టాప్–5000లో స్థానం సంపాదించారు. తక్కువ సంఖ్యలో విద్యార్థులతోనే అత్యధిక టాప్ ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్ ప్రత్యేకతగా నిలిచిందని సంస్థ పేర్కొంది. ఇటీవల విడుదలైన IIT–JEE మెయిన్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని, 450 మంది విద్యార్థులు IIT అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడం మరో సంచలనమని సంస్థ చైర్మన్ డా. వి. నరేందర్‌రెడ్డి తెలిపారు. పటిష్ట ప్రణాళికతో కూడిన బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రాబోయే IIT అడ్వాన్స్‌డ్, NEET ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.

## హక్కుల సాధన కోసం
# ఆదివాసీల సుదీర్ఘ పోరాటం

**ప్రొఫెసర్ హరగోపాల్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయమని చెప్పారు. అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభలో ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు. ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడిదారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని హరగోపాల్ పిలుపునిచ్చారు.

# బండి సంజయ్ ని బర్తరఫ్ చేయాలి

**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు**
**కేటీ రామారావు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బండి భగీరథ్ పై నమోదైన కేసుపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే ఆయన తండ్రి కేంద్రమంత్రి బండి సంజయ్‌ని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో అయన మాట్లాడారు. బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని అన్నారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ సంజయ్‌పై నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు, దేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్రమంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నది కేవలం నినాదానికే పరిమితమైతే న్యాయం జరగదన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానివ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదన్నారు. కేంద్ర మంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్య మంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా, ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా పోరాడారని గుర్తు చేశారు.

# ఇక అంతా పోలీసుల చేతుల్లోనే..?

**పోక్సో కేసు దర్యాప్తు పూర్తిగా రాష్ట్ర పోలీసుల పరిధిలోనే**
**బండి భగీరథ్ లొంగిపోయాడు**
**ఇక చర్యలు పోలీసుల నిర్ణయమే**
**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** బండి భగీరథ్ వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బండి భగీరథ్ ప్రస్తుతం పోలీసులకు లొంగిపోయాడని, ఇప్పుడు విచారణ మొత్తం రాష్ట్ర పోలీసుల చేతిలోనే ఉందని తేల్చి చెప్పారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా దర్యాప్తు చేసుకునే హక్కును కలిగి ఉంటుందని తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు ఎలాంటి విచారణ అయినా చేసుకోవచ్చన్నారు. పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ శనివారం పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఈ వ్యవహారంలో జరుగుతున్న హైడ్రామాకు తెరపడింది. బండి భగీరథ్ ను అరెస్ట్ చేసిన పోలీసులు, విచారణ జరిపి చర్లపల్లి జైలుకు తరలించారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో అడ్డుకున్న విషయాన్ని ప్రస్తావించిన కిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రతి పైసాను కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని, అలాంటప్పుడు రైతుల నుంచి ధాన్యాన్ని ఎందుకు కొనడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని అన్నదాతలు ధర్నాలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వారికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర మంత్రులు అన్ని జిల్లాల్లో పర్యటించి ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

## అరెస్ట్ చేయడం
### పోలీసులకు చేతకాలేదు

**శాసన, కార్యనిర్వాహక, న్యాయవవస్థలను నిర్వీర్యం చేశారు**
**సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** యువతులపై లైంగిక దాడులకు పాల్లడిన ఎవరెవరినో ఎన్ కౌంటర్ చేసిన రాష్ట్ర పోలీసులకు భగీరథ్ ను అరెస్ట్ చేయడానికి చేతకాలేదని సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ ఆరోపించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భగీరథ్ ను వెతకడానికి పది టీమ్ లను పం పించామని చెబుతున్నారని, ఆ పది టీమ్‌లు గోర్లు తీసుకుంటున్నాయా అని ఎద్దేవా చేశారు. భగీరథ్ ను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేశామని పోలీసులు చెబుతున్నారని, మరోవైపు బండి సంజయ్ తానే తన కుమా రుడిని పోలీసులకు అప్పగించానని చెబుతున్నారన్నారు. బండి సంజయ్ చెబుతున్న దాన్ని బట్టి పోలీసు వ్యవస్థ ప్రశ్నార్థకమైందని విమర్శించారు. భగీరథ్ ముద్దాయి అయ్యాడని ఈ కేసులో కోర్టు అసమర్థత కూడా కనిపించిందని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వెంటనే అరెస్ట్ చేసి ఉంటే ఈ గొడవ ఉండేదేకాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో తప్పు చేసిందన్నారు. నేడు మూడు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కేసు అయిన వెంటనే బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, న్యాయవ్యవస్థ సైతం ముద్దాయిగా నిలిచిందన్నారు. దీనిపై వెంటనే తగిన విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**బుగ్గారం మండలంలో మంత్రి అడ్లూరి సుడిగాలి పర్యటన**
**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు**



**ముద్ర, బుగ్గారం:** ప్రజల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం బుగ్గారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.బుగ్గారం మండలం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్న మంత్రి, చిన్నాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల కోసం ఇప్పటికే వివో భవనానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు.బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివుని ఆలయం వద్ద రూ.20 లక్షలతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి మంత్రి శంకుస్థాపన చేశారు. వచ్చే శివరాత్రిలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు.యశ్వంతరావుపేట గ్రామంలో రూ.37.45 లక్షలతో చేపట్టనున్న సాగునీటి కాలువ అత్యవసర పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. శేకల్ల గ్రామంలో రూ.16.10 లక్షలతో కాంపౌండ్ వాల్, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.మంత్రి వెంట మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ముష్కిన్ చెరువు అభివృద్ధికి అడ్డంకులు

**ఖాళీ చేయాలని హైడ్రా హెచ్చరిక**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడిసెలు, దుకాణా లను వెంటనే ఖాళీ చేయాలని హైడ్రా అధికారులు మరోసారి హెచ్చరించారు. ఏప్రిల్ 29న 10 రోజుల గడువు ఇచ్చినా, ఇప్పటివరకు కేవలం 10 శాతం మంది మాత్రమే ఖాళీ చేసినట్లు అధికారులు తెలిపారు. రియల్టర్లు చెరువు భూములను ఆక్రమించేందుకు ప్రజలను ముందుకు పెట్టి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. చెరువు పరిధిలో నిర్మాణ వ్యర్థాలు, మట్టి, చెత్త పోయడంతో ముష్కిన్ చెరువు విస్తీర్ణం క్రమంగా కుంచించుకుపోతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తను కాల్చడం, కాలువలను మూసివేయడం వల్ల చెరువు కాలుష్యానికి గురవుతోందన్నారు. శనివారం సాయంత్రం నివాసులను కలిసిన హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఒకటి రెండు రోజుల్లో ఎప్పుడైనా అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం ముష్కిన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 52.20 ఎకరాలు ఉండగా, బఫర్ జోన్‌తో కలిపితే ఇది 62 ఎకరాల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందులో కొంతభాగాన్ని పలు సంస్థలు, వ్యక్తులు తమదిగా క్లెయిం చేస్తున్నప్పటికీ, చెరువు భూమిలో నిర్మాణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి, వాతావరణం ఆహ్లాదకరంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 18.05.2026
www.mudranews.in | @mudranews



**చేపలతో విటమిన్-D పుష్కలంగా లభిస్తుంది**

చేపలు సహజసిద్ధమైన విటమిన్-D కి ఒక అద్భుతమైన వనరుగా పనిచేస్తాయి. ఇది శరీరంలో క్యాల్షియం గ్రహణ శక్తిని పెంచి, ఎముకలు మరియు పళ్ళను బలంగా ఉంచుతుంది.



## గౌరవ కుటుంబీకులారా!



కుటుంబం అంటే కేవలం నాలుగు గోడల
మధ్య జీవనం కాదని తెలుసుకోండి,
నాలుగు హృదయాలు
ఒకే స్పందనగా కొట్టుకునే
స్నేహసౌధంగా భావించండి||
ఒకటిగా ఉండండి వాన గాలులెన్ని విరుచుకుపడ్డా
వేర్లు విడనాడని వృక్షంలా నిలబడండి,
విపత్తులు ఎన్ని ఎదురైనా
విడిపోని వెలుగులా నిలవండి||
ఒకేతాటిపై నడవండి అడుగులు వేరైనా
ఆశయాలు ఒక్కటై సాగండి,
మాటలు భిన్నమైనా
మనసులు కలిసే మార్గమై ఉండండి||

ఒకేమాటపై నిలబడండి
నమ్మకం అనే నిటారుదీపాన్ని ఎప్పటికీ
ఆరనీయకండి,
అపార్థాల మబ్బులొచ్చినా
ఆప్యాయతను సూర్యునిలా
వెలిగించండి||


"మేము అంతా ఒకటే" అని చాటండి
అన్నదమ్ముల అనుబంధంలో,
అక్కచెల్లెళ్ల ఆప్యాయతలో,
తల్లిదండ్రుల త్యాగాల్లో ప్రేమ పరిమళం
పంచండి||

ఒకరికొకరమని నిరూపించండి
కష్టాల్లో చేయూతగా నిలబడి,
కన్నీళ్లలో ఓదార్పుగా మారి,
సంతోషాల్లో నవ్వుల హారతిగా
సహచరులై సాగండి||

ఒకటే ఆశయం పెట్టుకోండి
"మన కుటుంబ సంతోషమే మా
సంపద"
అనే మహామంత్రం జపించండి,
అనురాగాల అమృతవర్షం
కురిపించండి||

కుటుంబం కలిసుంటే
చిన్న ఇల్లు కూడా స్వర్గమవుతుందని
చెప్పండి,
మనసులు కలిసుంటే
చిన్న జీవితం కూడా మహాకావ్యమవుతుందని తెలపండి||

కుటుంబాన్ని
గౌరవంగా గుండెల్లో నిలుపుకోండి,
అనురాగంగా ఆత్మీయత పంచుకోండి,
ఆనందనిలయంగా
వెలిగే అమృతబంధమని
గుర్తించండి||



**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
భాగ్యనగరం.

# దేశంలో తొలి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్

- అమరావతి వేదిక కావడంపై సీఎం చంద్రబాబు హర్షం
- సైబర్ భద్రతలో కొత్త దశకు శ్రీకారం చుట్టిన ఏపీ ప్రభుత్వం
- సీ-డాట్ భాగస్వామ్యంతో ఎస్ఆర్ఎంలో ఆధునిక క్వాంటం పరిశోధన కేంద్రం
- నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్‌కు హబ్‌గా అమరావతి
- విద్యార్థులు, స్టార్టప్‌లకు ప్రపంచ స్థాయి టెక్నాలజీ అవకాశాలు



**ముద్ర, అమరావతి :** దేశంలోనే తొలి క్వాంటం–సెక్యూర్ కమ్యూనికేషన్స్ టెస్ట్ బెడ్ అమరావతిలో ఏర్పాటు కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టెలికమ్యూనికేషన్ మరియు ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, భవిష్యత్ డిజిటల్ భద్రతకు ఇది కీలక అడుగుగా అభివర్ణించారు.

భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్, అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీలో ఈ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేస్తోంది. క్వాంటం కమ్యూనికేషన్, సురక్షిత నెట్‌వర్క్ వ్యవస్థలు, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలు, ఫోటోనిక్ మరియు ఆప్టికల్ సిస్టమ్స్ రంగాల్లో పరిశోధనలకు ఇది కేంద్రంగా మారనుందని సీఎం పేర్కొన్నారు.

ఏప్రిల్ 14న క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభం తర్వాత అమరావతిలో టెలికమ్యూనికేషన్, ఐటీ, క్వాంటం టెక్నాలజీ రంగాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతోందని ఆయన తెలిపారు. నెక్స్ట్ జనరేషన్ సైబర్ డిఫెన్స్ సొల్యూషన్స్ అభివృద్ధికి అమరావతి కేంద్ర బిందువుగా మారబోతోందని వెల్లడించారు.

ఈ టెస్ట్ బెడ్ ద్వారా "మేక్ ఇన్ ఇండియా" సాంకేతికతలకు ప్రోత్సాహం లభించడంతో పాటు, సురక్షిత డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో అమరావతికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఫ్రంటియర్ టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, డీప్–టెక్ ఆవిష్కరణలకు అమరావతి ప్రముఖ కేంద్రంగా ఎదుగుతుందని చెప్పారు.

అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏపీ విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలకు ప్రపంచ స్థాయి సాంకేతికతల రూపకల్పనలో భాగస్వామ్యం అయ్యే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. టెస్ట్ బెడ్ ఏర్పాటులో భాగస్వాములవుతున్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు, సంస్థలకు సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు.

### 15వ అంతస్తు పైనుంచి దూకి బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య




**ముద్ర కూకట్‌పల్లి:** మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అపార్ట్‌మెంట్ 15వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం... కాశ్మీరి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పుష్ప కుమార్ టిక్కూ (66), తన కుటుంబంతో కలిసి మూసాపేటలోని మెరీనా స్కై అపార్ట్‌మెంట్స్, టవర్–2లోని ఫ్లాట్ నంబర్ 1502లో నివసిస్తున్నారు. గత ఆరేళ్లుగా ఆయన తీవ్రమైన మెదడు నరాల సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మానసిక వేదనకు గురైన ఆయన, ఆదివారం తెల్లవారుజామున తన ఫ్లాట్ ఉన్న 15వ అంతస్తు నుండి కిందకు దూకారు. తీవ్ర గాయాలవ్వడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

### నారా దేవాన్ష్ యూట్యూబ్ చానల్ "డినో డీట్స్" ప్రారంభం

- తనయుడి టీజర్‌లో తండ్రి లోకేష్ కూడా భాగమయ్యారు
- దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలిపిన నారా-నందమూరి కుటుంబసభ్యులు





**ముద్ర, అమరావతి :** మంత్రి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ ``డినో డీట్స్ ``పేరుతో యూట్యూబ్ ఛానల్ ఆరంభించారు. ఈ సందర్భంగా నారా–నందమూరి కుటుంబసభ్యులు దేవాన్ష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ``డినో డీట్స్ ``టీజర్‌లోనూ మంత్రి నారా లోకేష్ పాలుపంచుకుని దేవాన్ష్ యూట్యూబ్, పాడ్ కాస్ట్ ప్రత్యేకతలు తెలుసుకున్నారు. డైనోసార్లు, శిలాజాలు , పురాతన అవశేషాల గురించి తాను తెలుసుకున్న ఆశ్చర్యపరిచే నిజాలు, డైనోసార్ల వింతలు–విశేషాలు ఆకట్టుకునే శైలిలో, నవ్విస్తూ, ఆలోచింపజేసేలా దేవాన్ష్ అందించే పాడ్ కాస్ట్‌లు ఈ యూట్యూబ్ చానల్ ద్వారా వీక్షకులకు చేరనున్నాయి. దేవాన్ష్ సృష్టించిన ప్రాచీన ప్రపంచంలోకి నేను ఒక ప్రేక్షకుడిలా ప్రవేశించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నానంటూ మంత్రి నారా లోకేష్ ఉద్విగ్నంగా తన భావాలను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

యూట్యూబ్ చానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చిన నారా దేవాన్ష్ చదరంగంలో క్లిష్టమైన 175 పజిల్స్‌ను వేగంగా పరిష్కరించడం ద్వారా 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. '5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్' పుస్తకంలోని 175 సంక్లిష్టమైన చెక్‌మేట్ పజిల్స్‌ను గతేడాది దేవాన్ష్ వేగంగా పరిష్కరించి ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు.

## యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో అగ్నిప్రమాదం

**యూనిట్-3 టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో చెలరేగిన మంటలు**
**కాలిబూడిదైన కంట్రోల్ కేబుల్స్**

**ముద్ర, నల్గొండ :** నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ స్టేషన్ లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్‌లోని యూనిట్–3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఆదివారం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు భయాందోళనలకు గురయ్యారు. పంప్ వద్ద ఉన్న లూబ్రికేషన్ ఆయిల్ లీకేజీతోనే ఈ మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో ప్లాంట్ ఆవరణ అంతటా దట్టమైన నల్లటి పొగ అలుముకుంది. ప్రమాద తీవ్రతకు పంప్ పరిధిలోని కంట్రోల్ కేబుల్స్, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా కాలిపోయాయి. అయితే, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాలు, ప్లాంట్ సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రధాన యంత్రాలకు (మెయిన్ టర్బైన్లు, బాయిలర్లు) ఒక భారీ ముప్పు తప్పింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జెన్‌కో ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు మరియు ప్రమాద గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు అంతర్గత దర్యాప్తుకు ఆదేశించారు.



## ఒకే టికెట్ పై 3 సార్లు శ్రీవారి దర్శనం

- భక్తులకు టీటీడీ బంపర్ ఆఫర్.. - 21న ఆన్లైన్లో టికెట్ విడుదల
- 5వేల టికెట్ కొన్నవారికి మాత్రమే ఛాన్స్

**ముద్ర డెస్క్ :** తిరుమల శ్రీవారిని ఒకే టికెట్‌పై వరుసగా మూడు రోజుల పాటూ దర్శనం చేసుకునే అద్భుత అవకాశం భక్తులకు వచ్చింది. తిరుమలలో ఆగస్టు నెలలో నిర్వహించే పవిత్రోత్సవాల్లో భాగంగా భక్తులకు అవకాశం దక్కింది. పవిత్రోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటూ ఒకే టికెట్‌పై శ్రీవారి మూలమూర్తిని దర్శించుకునేందుకు భక్తులు టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తిరుమలలో జరిగే ఈ సేవలో పాల్గొలనుకునే భక్తులకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. 21న ఉదయం 10 గంటలకు టీటీడీ పవిత్రోత్సవాల టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వార్షిక పవిత్రోత్సవాల (23–08–26 నుంచి 25–08–26) టికెట్లను కూడా మే 21 ఉదయం 10గం. ఆన్లైన్ లో విడుదల చేస్తారని టీటీడీ తెలిపింది. భక్తులు ఈ టికెట్‌ను ఇద్దరికీ కలిపి రూ.5,000 చెల్లించి కొనుగోలు చేయాలి. ఈ టికెట్లు పొందిన భక్తులు తిరుమలలో నిర్వహించే పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు స్నపన తిరుమంజనంలో పాల్గొనే అవకాశం ఇస్తారు. అంతేకాదు పవిత్రోత్సవాలలో భాగంగా చివరిరోజు పూర్ణాహుతిలోకూడా పాల్గొనవచ్చు. తిరుమలలో పవిత్రోత్సవాల్లో పాల్గొనే భక్తులు ఉదయం 7 గంటలకు వైకుంఠం క్యూకాంప్లెక్స్–1 దగ్గరకు సంప్రదాయ వస్త్రధారణతో చేరుకుని ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపిస్తే అనుమతిస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్స వాలు ఆగస్టు 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు ఆగస్టు 22న అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే అర్చనలు, ఉత్సవాల్లో భక్తులు, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగుతాయి. టీటీడీ ఆగమశాస్త్రం ప్రకారం దోషాలు వల్ల ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు టీటీడీ ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్..

- నేటి నుండి ఉప్పల్-వరంగల్ రింగ్ రోడ్ మూసివేత
- కొనసాగుతున్న ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు
- రెండు నెలల పాటు రాకపోకలు బంద్

**ముద్ర డెస్క్ :** హైదరాబాద్ నగరవాసులకు అలర్ట్.. అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ రింగ్ రోడ్డు చౌరస్తాను నేటి నుంచి తాత్కాలికంగా మూసివేశారు. ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కోసం మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి.రామంతాపూర్, హబ్సీగూడ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక నుంచి బీరప్పగూడ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకునే మళ్లింపు చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ కార్యాలయం పక్కనున్న వరంగల్ బస్టాప్‌ను ఇప్పటికే నల్లచెరువు కట్ట వద్దకు మార్చిన సంగతి తెలిసిందే.నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి లేదా సర్వీస్ రోడ్డు మార్గాన ఘట్‌కేసర్ వద్ద వరంగల్ జాతీయ రహదారికి చేరుకోనున్నాయి.ఫీర్జాదిగూడ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఉప్పల్ జంక్షన్ రాకముందు ఉన్న లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మాస్టర్ చెఫ్ రెస్టారెంట్ చేరుకుని, అక్కడ యూటర్న్ తీసుకుని సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. ఫీర్జాదీగూడ నుంచి నాగోలు వెళ్లాంటే ఉప్పల్ భగాయత్ లేఅవుట్ ద్వారా చేరుకోవాల్సి ఉంటుంది. నాగోలు నుంచి వరంగల్ వైపు వాహనాలు కూడా భగాయత్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. హబ్సీగూడ నుంచి నాగోలు వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆంక్షలు లేవు.

## కుళ్ళిపోయిన స్థితిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

- మియాపూర్ కేసుతో లింక్

**ముద్ర కూకట్‌పల్లి:** కూకట్‌పల్లిలోని ఉదాసీన్‌మఠ్ ఖాళీ స్థలంలో శనివారం రాత్రి ఒక పురుషుడి మృతదేహం కుళ్ళిపోయిన స్థితిలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఉదాసీన్‌మఠ్ ఖాళీ స్థలంలో ఒక మృతదేహం పడి ఉన్నట్లు అక్కడి లేబర్ ఇన్‌చార్జ్ రాధే మాజ్జీ, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ సూరజ్ కుమార్ మిశ్రాకు సమాచారం అందించారు. సూరజ్ కుమార్ వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా, కాలువ పక్కన పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. పక్కనే ఉన్న చెట్టు కొమ్మకు నల్లటి బెల్ట్ వేలాడుతూ ఉంది.మృతదేహంపై షర్ట్ ప్యాంట్ ఉన్నాయి. ప్యాంట్ జేబులో ఒక సెల్‌ఫోన్, మృతదేహం పక్కనే చెప్పులు లభ్యమయ్యాయి. సెక్యూరిటీ ఇన్‌చార్జ్ డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో, కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మృతుడిని నిజాంసాగర్ ప్రాంతానికి చెందిన వల్లూరి బాలకిషన్ (25) గా గుర్తించారు. ఇతను మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలో నివసిస్తూ, మెడ్‌ప్లస్ సంస్థలో పనిచేస్తున్నాడు. మృతుడు బాలకిషన్‌పై గత మార్చి (2026) నెలలో మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. భార్య వేధింపుల కారణంగా మరణించిన కేసులో ఇతను నిందితుడిగా ఉన్నాడు. కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు అధికారిక గుర్తింపు దిశగా తొలి అడుగు



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు అధికారిక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ తొలి సమావేశం శనివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో డాక్టర్ కె. కేశవ రావు నివాసంలో జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటైన ఈ కమిటీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ, అమలు విధానాలపై చర్చించింది. కమిటీకి డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి గౌరవం, సంక్షేమ సౌకర్యాలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిటీ సభ్యులు తెలిపారు.


## ప్రేమించలేదని యువతిని హత్య చేసిన యువకుడు

**స్థానికుల దాడిలో నిందితుడు మృతి**



**ముద్ర డెస్క్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడు, తనను ప్రేమించలేదనే కక్షతో యువతిపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు ఆగ్రహంతో నిందితుడిని పట్టుకుని తీవ్రంగా కొట్టడంతో అతడు కూడా చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం, నిమ్మబావిగడ్డ ప్రాంతానికి చెందిన వైష్ణవి (24) జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్న తేజ అనే యువకుడు ఆమెను అడ్డగించాడు. ఇటీవల వైష్ణవికి నిశ్చితార్థం జరగడంతో కక్ష పెంచుకున్న తేజ, వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు, కడుపు భాగాల్లో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ఘటనను గమనించిన స్థానికులు, యువతి బంధువులు ఆగ్రహంతో నిందితుడిని పట్టుకుని కాళ్లు, చేతులు కట్టి తీవ్రంగా చితకబాదారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిసింది.ఘటనతో జడ్చర్ల ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



ముద్రణ, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను మంత్రి కొండా సురేఖ కలిసి సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు కూడా ముఖ్యమంత్రిని కలిసి పుష్కర మహోత్సవాలకు విచ్చేయాలని నిర్ణయించారు. జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు "సరస్వతి అంత్య పుష్కరాలు" ఘనంగా నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేష్, ఆలయ అర్చకులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 18-05-2026
www.mudranews.in | @mudranews



### చేపలతో మానసిక ఒత్తిడి తగ్గుతుంది

చేపలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల డిప్రెషన్ మరియు యాంగ్జయిటీ (ఆందోళన) వంటి సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఉండే పోషకాలు మెదడులో 'ఫీల్ గుడ్' హార్మోన్లను ప్రేరేపించి మానసిక ప్రశాంతతను ఇస్తాయి.

## ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫర్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అధ్యాపక బృందం, విద్యార్థులు, సీఎస్ఆర్ డోనర్స్‌ను ఘనంగా సన్మానించారు. అధ్యాపకులకు శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు బతుకమ్మ, కోలాటం, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. "డిజిటల్ ఇండియా – విద్యార్థి భవిత" అనే థీమ్‌తో ప్రదర్శించిన ప్రత్యేక నృత్య రూపకం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి, అధ్యాపకులు, సీఎస్ఆర్ డోనర్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతిరోజు 40 నిమిషాల నడక తప్పనిసరి

**- ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ రమేష్ చంద్ర**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లోని జెడ్పీ మైదానంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ రమేష్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్‌కు హైపర్‌టెన్షన్‌పై పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతిరోజూ కనీసం 40 నిమిషాల పాటు నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. నిత్య ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించి, మితంగా ఆహారం తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లాస్‌మేట్స్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్, సీనియర్ జర్నలిస్టులు కందికొండ మోహన్, మల్లేష్, నేతాజీ, వాకింగ్ వండర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాలనగర్‌లో బండి రమేష్ పాదయాత్ర



**ముద్ర, కూకట్‌పల్లి:** టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ ఆదివారం బాలనగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో తాము ఐడీపీ ఎల్ స్థలం రహదారి గుండా రాకపోకలు సాగించేవారమని, అయితే ఇటీవల ఆ దారికి అడ్డంగా ఫెన్సింగ్ వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, కొత్త డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బండి రమేష్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## మంచు మనోజ్ పుట్టినరోజు రక్తదాన శిబిరం

**- హాజరైన బండి రమేష్, నవీన్ యాదవ్**

**ముద్ర, కూకట్‌పల్లి:** ప్రముఖ సినీ హీరో మంచు మనోజ్ జన్మది నాన్ని పురస్కరించుకుని ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా రక్తదాన శిబి రం నిర్వహించారు. టీడీ పీ నాయకులు షేక్ సత్తార్, ఆర్కే చౌదరిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరానికి ఎమ్మెల్యే నవీన్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

## నేటి నుంచి యువజన క్రీడా వారోత్సవాలు

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడా వారోత్సవాలు నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. మే 18 నుంచి 23 వరకు జరిగే ఈ కార్యక్రమాలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా మెగా జుంబా కార్యక్రమం నిర్వహించడంతో పాటు 5 కిలోమీటర్ల వాక్‌థాన్‌కు మంత్రులు జెండా ఊపనున్నారు. ఈ వాక్‌థాన్‌లో సుమారు 2 వేల మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొంటారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను నిర్వహిస్తోంది.

## నేడు 'ఫిట్ అండ్ యాక్టివ్ 2కే రన్'



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా "ఆరోగ్య తెలంగాణ" కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 18న సోమవారం ఉదయం 7 గంటలకు నాగర్ కర్నూల్ పట్టణంలో "ఫిట్ అండ్ యాక్టివ్ 2కే రన్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ అధికారి సీతారాం నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి ప్రారం భమై కేసరి సముద్రం ట్యాంక్ బండ్ వరకు కొనసాగుతుందని ఆయన పేర్కొ న్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువతి యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు.

# రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**
**- తడిసిన ధాన్యం పరిశీలించిన మంత్రి**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డును మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించి, అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నమంత్రి, తడిసిన ధాన్యాన్ని కూడా గోదాములకు తరలిస్తున్నామని తెలిపారు. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో మొక్క జొన్న దిగుబడి అధికంగా రావడంతో గోదాముల కొరత ఏర్పడిందని, కాటన్ గోదాములు, ప్రైవేట్ గోదాములు, అవసర మైతే ఫంక్షన్ హాళ్లను వినియోగిస్తున్నా మని చెప్పారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి




**- సీపీఎం డిమాండ్**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలకు వ్యతిరేకంగా ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులతో ఆందోళన చేపట్టిన నాయకులు ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. వెంకటస్వామి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ధరలు పెంచబోమని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. సీఎన్‌జీ ధరలను రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు పెంచడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతన్న, లక్ష్మన్న, ఆంజనేయులు, రంగన్న,నరేష్, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు విద్యార్థులకు అవసరం




**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు విద్యార్థులకు అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా జోగులాంబ గద్వాల బాలభవన్‌లో నిర్వహించిన జవహర్ బాలభవన్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకుంటే ఎంచుకున్న రంగాల్లో రాణించే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాలు పెంపొందించేందుకు బాలభవన్ శిక్షణలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, చెస్, క్యారమ్స్, నృత్యం, చిత్రలేఖనం, హ్యాండ్‌రైటింగ్ వంటి వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

అనంతరం పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, విద్యాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుమ్మరులను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు

**- వికారాబాద్ జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు మారుతి**




**ముద్ర, తాండూర్ ప్రతినిధి:**

ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా చాలా వెనుకబడి అట్టడుగు స్థానంలో ఉన్న కుమ్మర కులస్తులను రాజకీయ పార్టీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వికారాబాద్ జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు మారుతి పేర్కొన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 33 జిల్లాల కార్యవర్గ సమావేశానికి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు మారుతీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కుమ్మర కులస్తులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షుడు నుడికుడి జయంత్ రావు ఆధ్వర్యంలో త్వరలోనే హైదరాబాద్ లో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించి కుమ్మరుల ఐక్యతను చాటుదామని పిలుపునిచ్చారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుమ్మర కులస్తులను బీసీ బీ జాబితా నుండి బీసీ ఏ జాబితాలో చేర్చాలని, చట్టసభల్లో కుమ్మర కులస్తులకు ప్రాధాన్యత నివ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మరి సంఘం నాయకులు మారుతీ, నారాయణ, అంజిలయ్య, ఎల్ఐసి శ్రీనివాస్, సత్తయ్య, రఘు, బుగ్గప్ప, రవి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



## పోయిన హ్యాండ్‌బ్యాగ్ రెండు గంటల్లోనే రికవరీ..

**ముద్ర, కూకట్‌పల్లి:** రద్దీగా ఉండే బస్ స్టాండ్‌లో ఓ మహిళ మరిచి పోయిన విలువైన హ్యాండ్‌బ్యాగ్‌ను సైబరాబాద్ పరిధిలోని కేపీహెచ్‌బీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేవలం రెండు గంటల్లోనే స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన ప్రకారం.. తాడేపల్లికి చెందిన వై.ఎస్. రాజేశ్వరి (60) అనే మహిళ చందానగర్‌లో జరిగిన ఒక పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం తిరిగి విజయవాడ వెళ్లేందుకు మధ్యాహ్నం కేపీహెచ్‌బీ బస్టాండ్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో మిగతా లగేజీ సర్దుకునే క్రమంలో తన హ్యాండ్‌బ్యాగ్‌ను అక్కడే మరిచిపోయారు. సుమారు 20 నిమిషాల తర్వాత గమనించి వచ్చి చూసేసరికి బ్యాగ్ కనిపించలేదు. అందులో రూ.25 వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్నాయి.

బాధితురాలి ఫిర్యాదుతో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. రాజశేఖర్ రెడ్డి, డీఐ రవి తమ సిబ్బందితో కలిసి వెంటనే రంగంలోకి దిగారు. బస్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాల సహాయంతో కేవలం రెండు గంటల వ్యవధిలోనే బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోగొట్టుకున్న సొత్తును ఇంత వేగంగా రికవరీ చేసి అప్పగించినందుకు బాధితురాలు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హెచ్ఐవీ బాధితులను వివక్ష లేకుండా ఆదరించాలి

**- డీఎంహెచ్ఓ డా. రవికుమార్ నాయక్**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి స్మారకార్థం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే "అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే" కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. రవికుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రవి కుమార్ నాయక్ మాట్లాడుతూ, హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల సమాజంలో ఇంకా అపోహలు, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని తెలిపారు. హెచ్ఐవీ బాధితులను చిన్నచూపు చూడకుండా మానవతా దృక్పథంతో ఆదరించాలని, సమాజం వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మరణించిన వారిని స్మరించుకోవడం, వారి కుటుంబాలకు మానసిక బలాన్ని అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో దిశా ప్రోగ్రామ్ మేనేజర్ రమేష్, ఫార్మసీ అధికారి సురేష్ కుమార్, ఎమ్.ఆర్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఏఎన్ఎంలు జి.జె. కవిత, సరస్వతి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 18.05.2026
www.mudranews.in | @mudranews



**చేపలతో చర్మం, జుట్టు మెరుస్తాయి:**



చేపల్లోని ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మానికి సహజమైన తేమను అందించి, ముడతలు పడకుండా కాపాడ తాయి. ఇవి జుట్టు కుదుళ్లను బలంగా మార్చి, జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి సహాయపడతాయి.

# ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగనీరు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం ధర్మపురి మండలం లోని అక్కేపల్లి చెరువును మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇరిగేషన్ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాగితాలకే పరిమితమైన అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు రోల్లవాగు ప్రాజెక్టు, వెల్లటూర్ ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. అక్కెపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ తో పాటు నియోజకవర్గంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఇబ్బందులు లేకుండా నిధులు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసినట్లు చెప్పారు. ఏడాదిలోపు పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిర్వహించే ఏజెన్సీ పనిచేయకపోవడంతో, వారి స్థానంలో కొత్త ఏజెన్సీకి అవకాశం కల్పించినట్లు వివరించారు. అక్క పెల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభించి రైతుల సూచనలు మేరకు నియోజకవర్గంలోని 5వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో రోల్ల వాగు ప్రాజెక్టుకు అటవీ శాఖ అనుమతి లేకుండానే పనులు ప్రారంభించారని ఆరోపించారు. ప్రాజెక్టు అంచనాలు పెంచి రైతులకు ఒక ఎకరానికి సైతం నీళ్లు ఇవ్వలేద న్నారు. రోళ్ల వాగు ప్రాజెక్టు అటవీ శాఖ అనుమతులు సాధించి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్నారు. వచ్చే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం మొదటి విడతగా రూ. 118 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన పనుల టెండర్లు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయా లని అధికారులకు సూచించారు.

## దేవాలయాల్లో చోరీ




**ముద్ర, కోరుట్ల:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి, తిమ్మాపూర్ గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. వేములకుర్తి పెద్దమ్మ దేవాలయం తాళం పగలగొట్టి మూడు మాసాల బంగారు పుస్తెలు, వెండి ముక్కు పుల్ల ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని రామాలయంలో హుండీలు పగులగొట్టి మూడు మాసాల బంగారం పుస్తెలు ఎత్తుకెళ్లారు. తిమ్మాపూర్ గ్రామం లోని పెద్దమ్మ దేవాలయ హుండీని పగలగొట్టి కొంత నగదు, విగ్రహం రెండు మాసాల ముక్కుపుల్లను ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాలను క్లూస్ టీం పరిశీలించారు. వేములకుర్తి గ్రామ దేవాలయ కమిటీ చైర్మన్ కొబాజీ లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై జీ. నవీన్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్**



**ముద్ర, కోరుట్ల:** రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తేమ పేరిట కోతలు, గన్నీ సంచుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవ డంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారన్నారు. మొక్కజొన్నకు కేంద్రం రూ.2400 మద్దతు ధర ప్రకటించినా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తేమ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని సురభి నవీన్ కుమార్ హెచ్చరించారు. తమ పార్టీకి రైతుల అభ్యున్నతి ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్య..

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్లు సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. అలాగే విద్యా వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం

**- అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే**




**ముద్ర, కరీంనగర్:** సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), డీఈవో అశ్విని తానాజి వాకడే అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఘనంగా నిర్వహించబడుతున్న ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ – విద్యా విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత గురువు స్థానం అత్యంత గొప్పదన్నారు.

డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి నంది శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆర్డీఓ మహేశ్వర్, విద్యాశాఖ ఏడి మాధవి, సెక్టోరల్ అధికారులు మిల్కూరి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, దాసి శ్రీనివాస్, ఉమారాణి, మహేందర్, రవీందర్, డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**




**బోథ్, ముద్ర:** నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం నూతనంగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. ఆదివారం ఆయన నిర్మల్ నుండి నేరడిగొండ, వడూర్, బొందిడి, దర్బా, ధన్నూర్, కుచూలపూర్ మీదుగా బోథ్ కు నడవునున్న బస్సు ను జెండా ఊపి ప్రారంభించారు. కొంత దూరం వరకు ఆయన ప్రయాణికులతో కలిసి బస్ లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి బోథ్ నియోజకవర్గ మారుమూల ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని మంత్రులను, ఆర్టీసీ అధికారులను కొత్తగా 11 బస్సులను నడిపించాలని కోరానన్నారు. తన వినతి మేరకు ఆర్టీసీ ప్రారంభించిన ఈ బస్ లను ఆయా ప్రాంతాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా దశాబ్దాలుగా కోరుతున్న బస్ సర్వీసు తమ గ్రామాల మీదుగా రాకపోకలు కొనసాగిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటిసారి తమ గ్రామాలకు ఆర్టీసీ బస్ వచ్చినందున ఎక్కడిక్కడ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట–బి లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో ఆదివారం 2008–09 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 18 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకొని ఒకరికొకరు యోగా క్షేమాలు తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన పాఠశాల, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువులతోనే తాము ఈ రోజు వివిధ స్థాయిలలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణానికి సహకరిస్తా



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. ఆదివారం తేజాపూర్ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు నేరడిగొండ లోని ఆడే గజేందర్ ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని గ్రామస్థులు కోరారు. ఆయన వెంటనే స్పందించి రామాలయం మందిరం అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే రామాలయం మందిరం వద్ద రూ.10 లక్షల వ్యయంతో మండపం నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రామాలయం కమిటీ సభ్యులు ఆడే గజేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రిగా ఇంద్రకరణ్ వెలగబెట్టిందేమిటి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పదేళ్లు అధికారం అనుభవించిన అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఏం వెలగబెట్టారని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విలాస్ ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటమి నుంచి ఇంకా కోలుకోలేక మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి మతి భ్రమించి స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్మెంట్ జీవితం ఎంజాయ్ చేస్తూ వెకేషన్ లో నిర్మల్ కు వస్తూ కేవలం మీడియాలో కనిపించడానికి ఏది పడితే అది మాట్లాడుతున్నారన్నారు. పదవుల కోసం, పైసల కోసం పార్టీలు మారే ఇంద్రకరణ్ కు బీజేపీ ని, ఏలేటి మహేశ్వర్ రెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నియోజక వర్గ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుండి కోట్లాది నిధులు తీసుకువస్తున్నారని తెలిపారు. బీజేపీ శాసనసభా పక్ష నేతగా రాష్ట్ర స్థాయిలో అటు అసెంబ్లీలో గొంతెత్తి పోరాడే ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేదిలేదని మండి పడ్డారు. నిర్మల్ లో మహా ధర్నాకు పిలుపు ఇస్తే రైతులు రోడ్ల మీదికి రాగానే ఉలిక్కి పడి ఇంద్రకరణ్ రెడ్డి మతి భ్రమించి మీడియా ముందుకు వచ్చాడన్నారు. ఏ ఎండకాగొడుగు పట్టే ఇంద్రకరణ్ స్వార్థం కోసం నిర్మల్ అభివృద్ధిని అటకెక్కించారన్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు చేసిన దందాలు ,అరాచకాలు, డి1 పట్టాల కథ ప్రజలందరికి తెలుసన్నారు. ఇకనైనా ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకొని నోరు అదుపులో పెట్టుకోవాలని బీజేపీ నేతలు హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, బీజేపీ సీనియర్ నాయకులు జమాల్, బీజే వై ఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, కౌన్సిలర్ సాత్విక్, ధని సర్పంచ్ బడి పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ముద్ర, కోరుట్ల:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సీఐ కె.లక్ష్మీనారాయణ సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ గ్రామాల పర్యటనలో భాగంగా ఆదివారం ఐలాపూర్ ను సందర్శించారు. గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎస్సై ఎం. చిరంజీవి, సర్పంచ్ దేవనపల్లి రామకృష్ణ, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.


## చేపలతో అధిక బరువు నియంత్రణ



చేపల్లో హై-క్వాలిటీ ప్రోటీన్ ఉండి, కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది తిన్న తర్వాత కడుపు నిండిన అనుభూతిని కలిగించి, బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది.

### అమెరికాలో రోడ్డు ప్రమాదం..

# చెర్వుగట్టు యువతి మృతి



**ముద్ర, నల్లగొండ:** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లాకు చెందిన యువతి మృతి చెందింది. నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టు గ్రామానికి చెందిన గడుసు శ్రీనివాస్ రెడ్డి – శోభ దంపతుల కుమార్తె గడుసు నవ్య ఈ ప్రమాదంలో మరణించింది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె, లేక్ కంట్రీ క్రౌన్ పాయింట్ దగ్గర శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. కుమార్తె మరణ వార్త విని తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తమ ఊరి బిడ్డ కానరాని లోకాలకు వెళ్లిందని తెలిసి చెర్వుగట్టు ప్రజలు విషాదంలో మునిగిపోయారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన నవ్య ఎం.ఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మంచి జాబ్ సాధించి అమ్మా, నాన్నకు చేదోడువాదోడుగా ఉండాలనుకున్న ఆమె కలల్ని రోడ్డు ప్రమాదం చిదిమేసింది. శ్రీనివాస్ రెడ్డి, శోభ దంపతులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి కూతురును అమెరికాలో ఉన్నత చదువుల కోసం పంపించారు. ఎంతో చలాకీగా ఉండే నవ్య మంచి ఉద్యోగం సాధిస్తుందని అకుకున్నారు. కానీ ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కన్నవాళ్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నవ్య మృతదేహన్ని స్వస్థలానికి తీసుకు వచ్చేందుకు సాయం చేయాలని కుటుంబ సభ్యులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

### కోమటిరెడ్డి సంతాపం

తన అభిమాని గడుసు శశిధర్ రెడ్డి సోదరుడైన శ్రీనివాస్ రెడ్డి కుమార్తె నవ్య మృతి తనను వ్యక్తిగతంగా కలిచివేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదనకు లోనయ్యారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. నవ్య మరణం తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు నవ్య మృత దేహాన్ని వెంటనే స్వగ్రామానికి తెప్పించేందుకు మంత్రి రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడారు. అమెరికాలోని తానా, ఆటా ప్రతినిధులతో మాట్లాడి నవ్య మృతదేహాన్ని స్వదేశానికి పంపించేందుకు సహకరించాలని కోరారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ తో మరణించిన వారికి నివాళి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అంతరిజాతీయ క్యాండిల్ లైట్ మెమొరీల్ డే సందర్భంగా హెచ్ఐవి, ఎయిడ్స్ తో మరణించిన వారికి స్కీడ్ స్వచంధ సంస్థ ఆధ్వర్యంలో నివాళులర్పించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫిసర్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవితో బాధ పడుతున్నావారు క్రమం తప్పకుండ ఆర్ట్ మందులు వాడుతు సరైన పౌష్టికాహారం తిని ఆరోగ్యం జాగ్రత్తలు పాటిస్తూ జీవిత కాలం బ్రతుకవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జి జి హెచ్ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఐసీటీసీ జిల్లా సూపర్ వైజర్ సంపతయ్య, స్కీడ్ స్వచంధ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ భానుకుమార్, ఐసీటీసీ కౌన్సలర్స్ ముత్యాలు, సతీష్, సైదులు, నరసింహ పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లాస్థాయి విద్యావిజయోత్సవం

**ముద్ర, సూర్యాపేట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాస్థాయి విద్యా విజయోత్సవం సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మరియు క్రీడా (స్పోర్ట్స్) విభాగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 10,000 నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి, భవిష్యత్తులో వచ్చే ఆధునిక అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు పాఠశాల విద్యాశాఖను కలెక్టర్ అభినందించారు. ఇదే ఉత్సాహంతో వచ్చే విద్యా సంవత్సరానికి గానూ 'బడిబాట' కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 శాతం కొత్త అడ్మిషన్లను పెంచేలా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కే. అశోక్, డీఐఈవో సులోచన రాణి, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, పూలన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వనమాల వెంకటేశ్వర్లుతో పాటు వివిధ మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పల్టీ కొట్టిన క్రేన్.. డ్రైవర్ మృతి



**ముద్ర, ఖమ్మం:** భారీ క్రేన్ అదుపు తప్పి పల్టీ కొట్టిన ఘటన లో డ్రైవర్ మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో ఈ విషాదం చోటుచేసుకుంది. కొణిజర్ల మండలానికి చెందిన రాజేష్ ఒక క్రేన్ డ్రైవర్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్రేన్‌తో పనులు ముగించుకొని తిరిగి సొంత ఊరు వెళ్తున్నాడు. ఇల్లెందు ఖమ్మం ప్రధాన రహదారి గాంధీనగర్ సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ దగ్గర్లో ఉన్నట్టుండి క్రేన్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. అప్రమత్తమైన రాజేష్ వెంటనే కిందికి దూకగా అతనిపై క్రేన్ పడింది. క్రేన్ కింద పడిన రాజేష్‌ను కాపాడేందుకు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సుమారు గంటపాటు ఆర్తనాదాలు చేస్తూ కొట్టుమిట్టాడుతూ రాజేష్ ప్రాణాలు వదిలినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్రేన్ యజమాని రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అంబులెన్స్‌లో రాజేశ్ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు పక్కన పడిన క్రేన్‌ను తొలగించడానికి సుమారు గంటన్నరకు పైగా పట్టింది. దాంతో ఇల్లందు ఖమ్మం ప్రధాన రహదారిపై వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి.

# వైభవంగా తిరువీధి ఉత్సవం



విశ్వేశ్వరుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనం, పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. దివ్య క్షేత్రంలో అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనం గావించారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడ వీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# పెట్రో, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య**




**ముద్ర, నల్గొండ :** పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని చెప్పి విదేశాల్లో మోడీ ఎంజాయ్ చేస్తున్నాడని వారు ఎద్దేవ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చిట్యాల మండల ఎనిమిదవ మహాసభ కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన జరగగా ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా నారి ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారతావనిలో పేదలు మరింత పేదలుగా ధనికులు మరింత ధనికులుగా పెరిగిపోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల గ్రామీణ వ్యవసాయ కూలీలు, పేదలు పని దొరకక కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మోడీ అధికారం చేపట్టిన తర్వాత పోరాడి సాధించుకున్న అనేక హక్కులు, చట్టాలు కాలరాయబడుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగా ఉపయోగపడే ఉపాధి హామీ పనిని విబి– జి రామ్ జి పథకముగా మార్చి చట్టానికి ఉరివేశారని అన్నారు. రోజు రోజుకు కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరగడం వల్ల రిజర్వేషన్లు మొత్తం పోయి పేదలకు ఉన్న కాస్త ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందే పరిస్థితిలో లేవని అన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయ కూలీలు వ్యవసాయతర కార్మికులుగా మారారని వారందరికీ ఉపాధి కోసం సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చి పెరుగుతున్న దరులకనుగుణంగా కనీస వేతనాల చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో దేశవ్యాప్తంగా పేదల సమస్యల పరిష్కారం కోసం, భూ పంపిణీ కోసం, ఉపాధి రక్షణ కోసం అన్ని వర్గాలను సమీకరించి పోరాటాలను కొనసాగిస్తామని వారు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కత్తుల లింగస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి మూడు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పథకం అమలు నోచుకోలేదని వ్యవసాయ కూలీలతో ఓట్లు వేసుకుని గద్దనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పొట్టలు కొట్టి పాలనా కొనసాగిస్తున్నారని తక్షణమే అమలు చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎర్రటి ఎండ లో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని చేసిన కష్టానికి వారం వారం వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని సంబంధిత అధికారులకు చెప్పినప్పటికీ చలనం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల పొట్ట కొట్టి వారి ఆకలి చావులకు ప్రభుత్వాలు బాధ్యత వాయించాల్సి వస్తుందని, గత ప్రభుత్వాల తీరుగా ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విమర్శించారు. ఈ మహాసభలో జీఎంపిఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య,చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరూరి శ్రీనివాస్, సంగం మండల అధ్యక్ష కార్యదర్శులు కల్లూరు కుమారస్వామి,మెట్టు పరమేష్, మండల ఉపాధ్యక్షులు రెడపాక మల్లయ్య, గోపగోని వెంకన్న మాజీ సర్పంచ్ ఎల్లయ్య, లీలావతి,మల్లేశ్వరి పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా మెట్టు పరమేష్, అధ్యక్షులుగా కోనేటి రాములు, ఉపాధ్యక్షులుగా ఊడుగు లీలావతి, లడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు కుమార స్వామి, సహాయ కార్యదర్శులుగా ఏర్పుల మల్లేశ్వరి రెడపాక మల్లయ్య కోశాధికారిగా గోపగోని వెంకన్నలతోపాటు 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# సుందరయ్యనగర్ లో పోలీస్ కార్డన్ సెర్చ్

**65 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు సీజ్**
**నలుగురు అనుమానితుల గుర్తింపు**
**శాంతి భద్రతల పరిరక్షణ కోసం**
**అనుమానిత వ్యక్తుల కదలికల నిర్మూలన**



**ముద్ర, సూర్యాపేట టౌన్ :** అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కోసం పోలీస్ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ తెలిపారు.సూర్యాపేట జిల్లా కేంద్రం, సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సుందరయ్య నగర్ కాలనీ నందు ఆదివారం తెల్లవారుజామున పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం నందు కాలనీలో ఉన్న ప్రతి ఇంటిని తనిఖీ చేసినారు. ఈ తనిఖీలలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, ఇతర రాష్ట్రాలకు ఇతర ప్రాంతాలకు చెందిన నేరస్తులు ఎవరైనా షెల్టర్ తీసుకున్నారా, దొంగతనాలకు గురైన వాహనాలు ఏమైనా ఉన్నాయా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశాలపై నిఘా ఉంచి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల నందు సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య పట్టణ ఎస్సె ల ఆధ్వర్యంలో 80 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట డిఎస్పి స్థానిక ప్రజలతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన భద్రత రక్షణ కల్పించడం, సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో భాగంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ అనుక్షణం పనిచేస్తుందని దీనిలో భాగంగానే ఈ కాలనీ నందు ఈరోజు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. కాలనీలోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వచ్చినట్లయితే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుండి ఇతర ప్రాంతాల నుండి వచ్చి షెల్టర్ పొంది నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నది కావున అలాంటి వారికి ఇండ్లు అద్దెకు ఇవ్వకూడదని పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి వాహనానికి అనుమతి పత్రం కలిగి ఉండాలని కోరారు, వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించాలని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో గాంజా ఇలాంటి మాదకద్రవ్యం మన యువతని పట్టిపీడిస్తుందని ఇలాంటి గంజాయిని మన కాలనీలోకి రానివ్వకూడదని గంజాయి సేవిస్తున్న వారు ఎవరైనా ఉన్నా గంజాయి సరఫరా చేసేవారు ఎవరైనా ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయికి అలవాటు పడిన వారిని సత్ప్రవర్తనకు తేవడం కోసం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ గార్ల ఆధ్వర్యంలో పునరావాస కేంద్రం ప్రభుత్వం ఆసుపత్రి నందు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలని పిల్లలను అభివృద్ధి పథంలో నడపడానికి ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. ఈ కార్డన్ అండ్ సర్చ్ కార్యక్రమంలో భాగంగా అనుమతి పత్రాలు లేనటువంటి నెంబర్ ప్లేట్లు లేనటువంటి సుమారు 60 ద్విచక్ర వాహనాలను, పది ఆటోలను సీజ్ చేయడం జరిగిందని సూచించారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేయగా గతంలో నేరాలకు పాల్పడిన సుమారు నలుగురిని గుర్తించామని వీరి యొక్క వివరాలు తనిఖీ చేసి ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారని విచారించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ ప్రజలు అందరూ కలిసిమెలిసి జీవించాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని కోరారు. రోడ్డు ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు అని ప్రమాదాలను నివారించవచ్చని. గంజాయి లాంటి మత్తుపదార్థాలు పిల్లల జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర్ నాథ్, శివతేజ, ఐలయ్య, బాలు నాయక్, సైదిరెడ్డి, కనకరత్నం, వెంకన్న, ఏఎస్ఐలు నరేందర్ రెడ్డి ముత్తయ్య, వెంకన్న, స్పెషల్ పార్టీ సిబ్బంది, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 18.05.2026
www.mudranews.in | @mudranews



**చేపలతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

చేపల్లో ఉండే జింక్, పొటాషియం, మెగ్నీషియం మరియు ఇతర ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇవి బాక్టీరియా, వైరస్‌లతో పోరాడేలా మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.



# విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించాలి

**-సిద్దిపేట కలెక్టర్ హైమావతి**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**
విద్యార్థులకు చదువుతో పాటు ఉన్నతమైన విలువలు నేర్పించాలని కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రక్రియలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ధైర్యంగా నిలబడడం, మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించడం, నాయకత్వ లక్షణాలతో కూడిన మంచి విలువలను అందించాలన్నారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 10 థీమ్ ల తోటి వారానికి ఒక్కో ప్రత్యేకమైన థీమ్ తో వారం మొత్తం కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అలాగే గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభలను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల కు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ వారం విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్య విజయోత్సవం కార్యక్రమం ఇక్కడ నిర్వహించుకుంటున్నామన్నారు. పుట్టగానే పిల్లలు తల్లిదండ్రులను, పాఠశాలలో టీచర్లను అనుసరిస్తారన్నారు. తల్లిదండ్రుల మాదిరి టీచర్లు కూడా విద్యార్థులకు ఆదర్శంగా పిల్లల పక్కన నిలబడాలని సూచించారు. సమాజం అనేది ఎక్కడో ఉండదు మన చుట్టూనే తిరుగుతూ ఉంటుందన్నారు. విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలంటే బేసిక్ ఫౌండేషన్ స్కూల్ స్టడీ మాత్రమే అని తెలిపారు. పిల్లలకు చదువుతో పాటు ధైర్యంగా ఉండడం, రకరకాల కొత్త నైపుణ్యాలను నేర్పడం, కష్టం వస్తే ఎలా తట్టుకుని నిలబడే మానసిక స్థైర్యాన్ని, శారీరకంగా బలంగా దృఢంగా ఉండాలో ప్రతిది పాఠశాల నేర్పిస్తుందన్నారు. పద తరగతిలో 97 శాతం ఫలితాలు వచ్చాయంటే, దాని వెనుక విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని వారిని అభినందించారు. చదువు పదో తరగతి వరకు సాగినట్లు ఇంటర్ లో ఉండదన్నారు. ఇంటర్ లో మీ ఇష్టం ఉన్న సబ్జెక్ట్ ఆధారంగా నచ్చిన రంగంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మీరు ఏదైతే నమ్ముతారో, ఎవరినైతే గౌరవిస్తారో, ఎవరినైతే ఆరాధిస్తారో, వాటిని బట్టే మీకు సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. చదువు తో పాటు ఆటలు, యోగా, కల్చరల్ ఆక్టివిటీస్ లాంటివి నేర్పించాలన్నారు. వాటి ద్వారా వ్యక్తిగతంగా దృఢంగా ఉండడంతో పాటు నాయకత్వ లక్షణాలతో కూడిన సామర్థ్యాలు విద్యార్థులకు వస్తాయని తెలిపారు.

**వచ్చే సంవత్సరం నుంచి బ్రేక్ ఫాస్ట్..**

ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం తో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుంచిఉదయం బ్రేక్ ఫాస్ట్ పథకం కూడా అమలు చేయబోతుందన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైతం మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నట్లు తెలిపారు.

అనంతరం పదో తరగతిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పదివేల రూపాయల చెక్కును, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పలువురి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా 18 నుండి 23 వరకు నిర్వహించబోయే యువత– క్రీడల ప్రోత్సా హం సంబంధించిన గోడపత్రికను ఆవిష్క రించారు. ఈ సమావేశంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## అ'పూర్వ' విద్యార్థుల కలయిక




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** చిన్నకోదూర్ మండలంలోని చంద్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005– 06 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఇరువై ఏళ్ల తర్వాత మళ్లీ అందరూ తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో చిన్నపిల్లల్లా మారిపోయారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న సమయంలో జరిగిన సంఘటనలు,, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలనర్సయ్య, అబ్దుల్ అజీజ్, విష్ణువర్ధన్, లక్ష్మయ్య, వరప్రసాద్, పూర్వ విద్యార్థులు పవన్, బి.నరేష్, వెంకట్, అంజి, సంతోష్, ఎ.నరేష్, స్వామి, అనిల్, నరేన్, కిషన్, పి.స్వాతి, నాగరాణి, పద్మ, లావణ్య, డి.స్వాతి, రమ్య, డి.రజిత, బి. రమ్య, బి.రజిత, కవిత, మాధవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## పెట్రో ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ ఆందోళన



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఆదివారం జిల్లాలో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రవల్లి స్వర్ణక్క పిలుపుతో జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంద వనజ, జిల్లా జనరల్ సెక్రెటరీ కొడంగల్ రజిని, గొట్టే కవిత, టౌన్ అధ్యక్షురాలు మార్క పద్మ గౌడ్, బ్లాక్ ప్రెసిడెంట్ లహరి, మండల అధ్యక్షురాలు బాలలక్ష్మి, నంగునూరు మండల అధ్యక్షురాలు లావణ్య, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సంతోషి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోషి, సన శ్యామలతో పాటు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణనలో భాగస్వాములు కావాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టర్ ప్రతిమా సింగ్ దంపతులు క్యాంపు కార్యాలయంలో డిజిటల్ జనగణన కార్యక్రమంలో తమ వివరాలను నమోదు చేసుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశంలో జరుగుతున్న డిజిటల్ జనగణన కార్యక్రమంలో భాగంగా, ప్రతి పౌరుడు ప్రొవిజనల్ గైడ్‌లైన్స్ ప్రకారం తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదన్నారు. జన గణనలో భాగస్వామ్యులు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## రాష్ట్ర స్థాయిలో మెదక్ జిల్లా విద్యార్థుల ప్రతిభ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రాష్ట్ర స్థాయిలో మెదక్ జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. హైదరాబాద్ లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమం లో ప్రతిభ కనబరిచారు. దోపిడీ, అక్రమ రవాణాలను నివారించడానికి, ప్రతిస్పందించడానికి బాలల రక్షణ వ్యవస్థలను మెరుగుపరచడం అనే ఎజెండా అంశంలో పదిమంది పాల్గొనగా ఎనిమిది మంది మెదక్ జిల్లాకు చెందినవారే విజేతలుగా నిలిచారు. ఆలాగే ప్రెస్ సభ్యుడిగా ఎంపికైన శంకరంపేట్ (ఆర్) కు చెందిన విద్యార్థి కి స్పెషల్ మెన్షన్ అవార్డు లభించింది. యూనిసెస్ కమిటీలో భాగంగా స్పెషల్ డెలిగేటుగా పి.పూజ, హై కమెండేషన్స్ వన్ గా బి. అభిజ్ఞ, హై కమెండేషన్ టు గా ఎల్. వనిషిక, స్పెషల్ మెన్షన్ గా కె.అభిజ్ఞ, హానరబుల్ మెన్షన్ లో టీ. జయశ్రీ, ఆర్సియా ఫాతిమా, పి. ఐశ్వర్య, ఏ.సమీక్ష విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయి నుంచి ఎన్నికైన 11 మందిలో తొమ్మిది మంది విజేతలుగా నిలవడం మెదక్ జిల్లాకు గర్వకారణం. ఇందుకు కారకులైన అందరికి జిల్లా విద్యాధికారి రాజు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ గా టి.లింగమయ్య, జె.స్వరూపారాణి, సందీప్, కృష్ణ, రిసోర్స్ పర్సన్ గా రవిబాబు బూరుగుపల్లి, తిరనగరి నర్సింలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు కంట్రోల్ రూం ఏర్పాటు

**- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి మెదక్:**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మెదక్ కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ 9553866388 ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక, శిక్షణ, ముద్రణ, జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 31న ముసాయిదా జాబితా ప్రచురణ చేయనున్నట్లు వివరించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు, సెప్టెంబర్ 28 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1న తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

## వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
జిల్లాలోని చెక్‌పోస్టులు, అవుట్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పోలీసులకు సూచించారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీలపల్లి గ్రామంలో ఇటీవల సంచలనం సృష్టించిన దొంగతనం కేసు పురోగతిపై ఎస్పీ ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షించారు. కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల నుండి సేకరించిన ఆధారాలు, అనుమానితుల వివరాలపై చర్చించారు. డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, జాన్ రెడ్డి, జార్జ్, రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐలు బాలరాజ్, శివానందం, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పష్టమైన సమాచారం సేకరించాలి

**- మెదక్ అదనపు కలెక్టర్ నగేష్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
జనగణనలో స్పష్టమైన సమాచారం సేకరించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఎన్యూమరేటర్లను ఆదేశించారు. ఆదివారం హవేలీ ఘనాపూర్ మండలం బ్యాతోల్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. అలాగే గ్రామంలో జనగణన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం డౌన్ లోడ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం గోదాములకు తరలిస్తున్నామన్నారు. గోదాములకు తరలించబడిన ధాన్యాన్ని వేగవంతంగా డౌన్ లోడ్ చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు.

జనగణన ఎన్యూమరేటర్లతో మాట్లాడి వివరాల నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలని సూచించారు. స్వాతంత్ర్యం తర్వాత ఇది 16వ జనగణన అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి జనగణన అన్నారు. ఈసారి తొలి సారిగా డిజిటల్ విధానంలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే స్వీయ గణన విధానాన్ని కూడా ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఆయన వెంట ఆర్ఐ సిద్దు ఉన్నారు.

# విద్యార్థి దశ ఎంతో కీలకం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును ఆదివారం మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడల్లో లత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థికి పదివేల చొప్పున నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, సీఎంఓ రాజు, ఏఎస్ఓ నవీన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




**ఉత్తర తెలంగాణ వార్తలు..**

# షరతులు లేకుండా జొన్నలు కొనాలి

**బోథ్, ముద్ర:**
రైతులు పండించిన జొన్నలను షరతులు, తరుగు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. ఆదివారం బోథ్ మండలంలోని మర్లపల్లి గ్రామంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఇచ్చోడ ద్వారా ఏర్పా టు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరానికి పది క్వింటాళ్లు కాకుండా 25 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఎకరానికి పది క్వింటాళ్ల పరిమితి విధించడంతో జొన్న సాగు రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. కొనుగోళ్ల పరిమితితో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం జొన్న రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6–3–569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com